**మ**నం అభివృద్ధి చెందుతున్నాం...

మనం అతి త్వరితంగా పురోగమిస్తున్నాం ..

మన అభివృద్ధి (మనం) ఒప్పుకోక పోయినా • ఫారిన్ జర్నలిస్టులు ఒప్పుకున్నారు (ఇందిరా వాణి).

మరి అలాంటప్పుడు మనం ఏ రంగంలో, ఏ భాగంలో, ఏ కోణంలో ఎంత అభివృద్ధి చెందాం? చెందేస్తున్నాం? అలాగే ఎంతెంత అదనంగా (అంటే తలసరి-నెలసరి-ములసరి-వారీగా) సుఖపడ్తున్నాం తెలుసుకోవాలి. దానికే దీన్ని ఎవరికి వారు ఆన్సర్ చేసుకోవాలి.

స్కేల్ లేకుండా దేన్నీ కొలవలేం. కాబట్టి 1965 నుండి అంటే 'సోషలిజం' స్వతంత్రం పొందినప్పటినుంచి కొలుద్దాం. 'సోషలిజం' అరవై ఐదులో స్వతంత్రిస్తే అరవై తొమ్మిదిలో పబ్లిక్‌గా రిపబ్లిక్ అయిందని ఈ సందర్భంలో పాఠకులు గుర్తించగలరు.

పుత్రపౌత్రాభివృద్ధిగా నేజెప్పబోవు, మీరు విప్పబోవు సోషలిజం మార్క్-వర్(ల్)డ్ పజిల్‌కి ఇక బిగిన్—




1. గడిచిన ఎనిమిదేళ్ళలో రైల్వేవాళ్ళు ఎన్నిసార్లు సమ్మెచేశారు? ఎన్నిసార్లు మీ ప్రయాణాలు నిరోధ్ ఇంపబడ్డాయి?

2. ఎయిరిండియా పైలెట్లు ("దపూరెస్ట్ పెయిడ్" ఇన్ ఇండియా!) ఎన్నిసార్లు (సంవత్సర - నెల - దినవారీగా) సమ్మెలు చేశారు? వాళ్ళ సమ్మెలు ఎంత అక్రమమో వివరిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఫుల్ పేజీ ప్రకటనలకి డబ్బు ఎవరు కట్టి ఉంటారు చెప్పగలరా?

. 3. సరాసరి అత్యధిక ప్రభుత్వాల్ని పడగొట్టుకున్న ఖ్యాతిపొందిన రాష్ట్రం ఏది? ఆ ప్రభుత్వాలు పడటంలో కాంగ్రెసీయులు ఏ శాతంలో సాయం చేశారు?

4. మీరు ప్రయాణం చేస్తున్న (మీ సేవే మా ధర్మం మార్కు) బస్సుల రేట్లు ఎన్నిసార్లు పెరిగాయి?

5. ఆంధ్రా ఎన్. జి. వో. ల మొత్తం సమ్మెదినాలు ఎన్ని? (నాటిని మొత్తం రోజుల్లోంచి తీసేస్తే సింపుల్‌గా పనిరోజులు వస్తాయి.)

6. ఈ మధ్యకాలంలో (మీ ఇంటావిడ) బజారుధరలమీద రోజుకి ఎన్ని సార్లుమాట్లాడింది? రాత్రి పడుకుంటూ మీరు మాట్లాడుకొనే అత్యంత ఆసక్తికరం అయిన టాపిక్ ఏమిటి?

7. కిరసనాయిలు, పెట్రోలు, ఉప్పు పప్పులు, కూరలు, పేపర్లు, సినిమాలు, గుడ్డలు, బియ్యంలో మట్టిగడ్డలు, హోటల్లో దోసెలు, సిగరెట్లు— ఇలా వేటి ధరా రోజురోజూ పెరగకుండా ఉండవు గాబట్టి, ధరపెరగని వస్తువు (ఇండియాలో మాత్రం చెప్పండి)

(షరా.– నిరోధ్ వదిలెయ్యండి)

8. మీ ఇంట్లో పండగలు మరచిపోయి ఎన్నాళ్ళు అయింది?

9. మీ ఊళ్లో ఏడాదికి ఎన్ని మార్వాడీ తాకట్టు కొట్లు పెరుగుతున్నయ్? మీరెన్నిసార్లు సందర్శించారు?

10. జీతం చాలక, ఇంట్లో పోరుపడలేక, "హల్లోలు" దొరకక రోజుకెన్ని సార్లు 'దేశమాత'ని తలచుకుంటున్నారు? ('దేశమాత' అనగా ఎవరు ఓటరూ?)

11. సిగరెట్లు సంవత్సరంలో ఏ మాసంనుంచి నల్లబడ్డాయి?

12. మీరు, లేదా మీ పిల్లాడు మొత్తం ఎన్నిగంటలు (సంవత్సర వారీగా) రేషన్‌షాపు దగ్గర గడిపారు?

13. బస్సులు నేషనలైజ్ అయాక మీరు పడ్తున్న సుఖం? (కిలోలలో)

14. నామ మాత్రోపమానంగా మిగిలిన ప్రతిపక్షం, దేశంలో ఎన్ని అల్లరకి పోలీసు ఫైరింగులకి కారణం?

15. (అయి) పోయిన యు. పి. ఎన్నికలకి కాంగ్రెసు ఎంత ఖర్చుపెట్టింది? మీ ఊళ్ళలో లేదా అప్పుడు గుజరాత్ బీహారుల్లో గోధుమ, పంచదారలు దొరక్క పోవడానికి కారణాలు ఏమిటి?

16. రోజూ పేపర్లలో తప్పక మానేది— పోలీసు ఫైరింగా? కాంగ్రెస్ పార్టీ లుకలుకలా? ధరల పెరుగుదలా? మరింత పౌరుషంతో కష్టాలు ఎదుర్కోమనే ప్రధాని ఉవాచలా?

17. దేశంలో సమస్యలు, కల్లోలాలు అల్లర్లు తిరుగుబాట్లకి కారణం ఎవరు?— బ్లాక్ మార్కెటీర్లా? ప్రైవేటు రంగమా? జనసంఘమా? కుడి పక్షమా?

18. రాబోయే సంవత్సరంలో వామ పక్ష నక్షత్ర ఫలితాలు?

19. ఇందిరా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తరచు ఎవరిమీద రెఫరెన్స్ ఉంటుంది?

20. కుల మత వర్గ భాషా ప్రాంతవర్గ ధన కనక శకట ఇంకా ఇంకా రహిత సమాజ వ్యవస్థ స్థాపించగలది ఏది? (దీనికి మాత్రం కాంగ్రెస్ తప్ప ఇంకేమీ అనకండి.)

'బహుమతులు — వివరంగా'

1. ఆల్‌రైట్స్‌కి ఫుల్ కప్ ఆఫ్ సోషలిజం ద్రావకం.

**2. ఒక తప్పుకి— నేషనలైజ్డు బ్యాంకులో అప్పు అప్లై చేసుకోడానికి ఆలస్యం జరగకుండా ప్రాతినిధ్యం.**

**3. రెండు తప్పులకి— రెండు (4 రూపాయల) ఎడ్వాన్స్ ఎలవెన్సులు. (దాన్ని ప్రభుత్వ చిన్న మొత్తాల పథకంలో పెట్టి సహకరించవచ్చు).**

**4. మూడు తప్పులకి— సోషలిజం మీద ఫ్రీ రేడియో ప్రోగ్రాం.**

**ఫలితాలు:—రాబోయే బడ్జెట్‌లో చూడగలరు.**

★

---

# కూరగాయలూ - కౌంటర్‌ఫీట్ నోట్లూ

1. "ఓ కుర్రవాడు ప్రొద్దున్నించీ సాయంత్రంవరకూ కూరగాయల మార్కెట్టుకు తిరుగుతూనే ఉన్నాడట. వాడు కూరగాయలన్నీ కొనుక్కున్న తర్వాతడబ్బులివ్వబోతే పదిపైసలు తక్కువయ్యాయట! కూరగాయలు అక్కడేవుంచి పరుగెత్తుకుంటూ వచ్చి పదిపైసలు తీసికెళ్ళి ఇవ్వబోతే కొత్తరేట్ల ప్రకారం మళ్ళీ పదిపైసలు తక్కువయ్యాయ్. కుర్రవాడేమో 'పదిపైసలు' తీసికెళ్తే కూరగాయలకు సరిపోయేంత వరకూ అలాగే తిరుగుతానని పంతంపట్టి ఇంటికీ కూరగాయల మార్కెట్టుకూ తిరగసాగాడు. వెళ్ళిన ప్రతిసారీ పదిపైసలు తగ్గుతూనే ఉన్నాయి. చివరకు పంతాన్ని వీడి తక్కువయిన పదిపైసలకూ ఓ పచ్చిమిరపకాయతొడిమ తుంచి కొట్టువాడికిచ్చేసి కూరగాయలు తెచ్చాడు."

2. 'దొంగరూపాయినోట్లు అచ్చేసేవాళ్ళు ఇప్పుడు లేరట! ఎందుకంటే నోట్లు అచ్చుగుద్దేందుకు వాడే 'కాగితం' ఖరీదు ఆ నోటు విలువకంటే ఎక్కువైపోయిందట.'

(కర్టెసీ: శ్రీ ధనికొండ హనుమంతరావు.)